అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 18 జనవరి 2023

సీఎస్‌ను కలిసిన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ రాష్ట్ర నూతన చీఫ్ సెక్రటరీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారినియ మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శాంతన్‌రావు కలిశారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ఆమె చాంబర్‌లో పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా గతంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన శాంతికుమారి అప్పటి పలు అంశాలపై చర్చించారు.

ఘనంగా శ్రీధర్‌రెడ్డి జయంతి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రానికి చెందిన వివేకానంద పాఠశాల, కళాశాల వ్యవస్థాపకుడు సురుకుంటి శ్రీధర్‌రెడ్డి జయంతిని ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు మండలలా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో శ్రీధర్‌రెడ్డి ఆనాడు వివేకానంద కేజీ నుంచి డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిన మహావ్యక్తి అని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతి ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, గ్రామ నాయకులు వెంకట్ రెడ్డి, వ్యాపారవేత్త కొత్తూరు సంతోష్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తలకు మించిన 'పని' భారం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాతాశిశు సంరక్షణ కోసం పాటుపడుతున్న రెండో ఏఎన్ఎంలు పనిభారంతో సతమతమవుతున్నారు. వచ్చే అరకొర వేతనానికి వీరు చేస్తున్న పనికి సంబంధం లేకుండా మారింది. రోజువారీగా టీకాల నమోదు, గర్భిణీల ఆరోగ్య స్థితిగతులు, ఎన్‌సీడీ కార్యక్రమం పర్యవేక్షణతో పాటు ఏకంగా 36రకాల రికార్డులు రాయాల్సి ఉంటుంది. వీటిని ఆఫ్‌లైన్‌తో రాయడంతో పాటు ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తి అన్ని రకాల పనులు చేయడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వం ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్ చేయాల్సిన పనులు ఏఎన్ఎంలతో చేయిస్తుండటంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అధిక పని ఒత్తిడి భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెగ్యులర్ ఏఎన్ఎంలతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సీఐటీయూ అనుబంధ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నేటి నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు.

- ఒత్తిడితో సతమతమవుతున్న రెండో ఏఎన్ఎంలు
- ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ రికార్డులు నమోదు
- అసలు విధులతో పాటు అదనపు పనులు అప్పగింత
- ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ నేటి నుంచి నిరసనలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వైద్యశాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించేది ఏఎస్ఎంలు. గ్రామీణ స్థాయిలో పేదలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తుంటారు. గర్భిణీలను ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లడం, చిన్నారులకు వివిధ రకాల టీకాలు వేయడం, ఎన్‌సీడీలో భాగంగా బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేయడం వంటి వివిధ రకాల పనులు చేస్తుంటారు. కానీ కేసీఆర్ కిట్ వచ్చిన తర్వాత ప్రభుత్వం వీరికి వివిధ రకాల పనులను అప్పగించింది. గ్రామీణ వైద్య సేవలపై రిజిస్టర్లలో ఆఫ్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లోనూ నమోదుకు ట్యాబ్‌లను అందజేసింది. వివిధ రకాల యాప్‌లు రూపొందించి వాటిలో రోజువారీగా సమాచారం నమోదు చేయాలని ఆదేశించింది. ఎలిజిబుల్ కపుల్ రిజిస్టర్, ఏఎన్‌సీ రిజిస్టర్, ఏఎన్‌సీ హైరిస్క్, పీఎన్‌సీ, ఇమ్యూనైజేషన్, విలేజ్ హెల్త్ రిజిస్టర్, ఓరల్ పిల్స్, ఐయూసీడీ, లెప్రసీ, టీబీ తదితర ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 36రకాల రికార్డులు నమోదు చేయిస్తూ తలకుమించిన భారాన్ని మోపుతోంది. దీంతో ఏఎస్ఎంలు పనిభారం భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



వేతనం తక్కువ..పని ఎక్కువ..!

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్‌హెల్త్ సెంటర్లలో సుమారు 500మంది రెండో ఏఎన్ఎంలు పనిచేస్తుంటారు. రెగ్యులర్ వారితో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా వేతనం మాత్రం తక్కువగా వేస్తోంది. వీరికి బేసిక్ పే రూ.31వేలు ఉండగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వీరికి మాత్రం కేవలం రూ.27వేలతోనే సరిపెడుతున్నారు. ఒక వైద్యుడు చేయాల్సిన పని తప్పితే అన్ని రకాల పనులు చేస్తున్నా ప్రభుత్వం వీరిని గుర్తించడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. అర్బన్ సెంటర్లలో ఒక్కో ఏఎస్ఎం పరిధిలో 15వేల మంది జనాభా కేటాయించగా.. పీహెచ్‌సీల పరిధిలో సుమారు 5వేల మంది జనాభా ఉంటారు. వీరందరి ఆరోగ్య సమస్యలన్ని ఈ రెండో ఏఎన్ఎంలే పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ వీరికి వేతనం మాత్రం అరకొరగా వస్తోంది. సుమారు పదిహేనేండ్ల నుంచి పనిచేస్తున్నా రెగ్యులరైజేషన్ కావడం లేదు. కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తూ అధిక పనిభారాన్ని మోస్తున్నారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతోంది. ఈ కార్యక్రమం కోసం వైద్యశాఖ ఇప్పటికే డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకాన్ని చేపట్టింది. అయినప్పటికీ మళ్లీ ఏఎన్ఎంల ద్వారానే కంటి వెలుగు వివరాలన్ని నమోదు చేయిస్తోంది. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే ఈ సంకేతాలు ఇచ్చినట్లు ఏఎన్ఎంలు చెబుతున్నారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అప్పగించాలి

పుష్పల, రెండో ఏఎన్ఎంల సంఘం కో కన్వీనర్



ప్రభుత్వం 36రకాల రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే బాధ్యతను అప్పగించడంతో పనిభారమవుతోంది. మరోపక్క తాజాగా ప్రారంభం కానున్న కంటి వెలుగు వివరాలు కూడా తమకే అప్పగిస్తున్నారు. రోజువారీ పనులతో పాటు కంటి వెలుగు వివరాలు నమోదు చేయడం ఇబ్బందిగా మారుతోంది. ఈ కార్యక్రమం కోసం కేటాయించిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఈ విధులను అప్పగించాలని కోరుతున్నాం.

పని భారాన్ని తగ్గించాలి

విజయలక్ష్మీ, రెండో ఏఎన్ఎంల సంఘం కన్వీనర్



ప్రభుత్వం రెండో ఏఎన్ఎంలకు కేటాయించిన పనులతో తీవ్రంగా ఇబ్బందులు పడాల్సివస్తోంది. మాతాశిశుసంరక్షణ పనులతో పాటు అదనపు పనులు అప్పగిస్తున్నారు. రోజువారీగా 36రకాల రికార్డులను ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో పనిభారం కారణంగా అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి అదనపు పనిభారాన్ని తగ్గించడంతో పాటు బేసిక్ పే అందజేయాలి. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి.

ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకై గిరి యువతకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఉట్నూర్



గ్రూప్-4, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకై గిరి యువతకు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ కె.వరుణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన అభ్యర్థులు అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా పూర్తి ప్రోత్సహం అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు తమ ఫిజికల్ టెస్ట్, అడ్మిట్ కార్డుతో పాటు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధృవపత్రాలు, ఆధార్ కార్డు, ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటోతో ఉట్నూరు కేబి కాంప్లెక్స్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ ఉచిత శిక్షణను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరి యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారి ఆ ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు 7893616392, 9493535052, 9666748105 ఫోన్ నెంబర్లు లకు సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో తొమ్మిది మంది డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో రాష్ట్రంలో పది మంది డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండే తొమ్మిది మంది ఉన్నారు. భైంసాలోని గోకుల్‌దాస్, పురుషోత్తమదాస్, డిగ్రీ కళాశాలలో నలుగురు, బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాలలో నలుగురు, నిర్మల్‌లోని నందన డిగ్రీ కళాశాలలో ఒక్కరు చొప్పున డిబార్ అయ్యారు. ఎవరైనా కాపీయింగ్‌కి పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

సర్కారు దవాఖానలో సురక్షిత కాన్పు



నవతెలంగాణ-తాంసి

సాదారణ సురక్షితమైన కాన్పులు పరీక్షలు సర్కారు దవాఖానలో జరుగుతున్నాయని మాత శిశుసంరక్షణ జిల్లా అధికారి భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ సారథి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులతో కలిసి 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి పౌష్టిక ఆహారంలో కీట్లను అందజేసి, గర్భిణులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు దవాఖానలో సురక్షితమైన సాధారణ కాన్పులు జరుగుతున్నాయి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో అన్ని విధాలా జబ్బులకు సంబంధించి పరీక్ష మిషన్లు ఉన్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలు అపోహలకు గురై ప్రయివేటు దవాఖానలో చికిత్సలు చేసుకొని వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారని అన్నారు. ఇకనైనా సర్కారు దవాఖానలో సురక్షితమైన సాదారణ ప్రసవం చేసుకోవాల అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్ రాజ్, విజేయ లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, లూసీ గంగాధర్, శ్రీదేవి, భాగ్యలక్ష్మి ఉన్నారు.

కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-గుడిహత్నూర్

కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమాలపై సర్పంచులు గ్రామాల్లో చాటింపు చేయించాలని సూచించారు. శిబిరాల వద్ద ప్రజలు గుమిగూడకుండా, ప్రణాళికబద్ధంగా, క్రమపద్ధతిలో కంటి పరీక్షలు నిర్వహించుకునేలా కట్టుదిట్టంగా వ్యవహరించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఏ రోజు ఏ ప్రాంతం నుంచి ఎంత మంది రావాలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, స్వయం సహాయక సభ్యులు ప్రజలకు అవగాహన కలిగించి కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. డీఆర్డీఓ కిషన్ కంటి వైద్య పరీక్ష చేయించుకున్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, డీఆర్డీఓ కిషన్, తహసీల్దార్ సంధ్యారాణీ, ఎంపీడీఓ సునీత, సర్పంచ్ సునీత జాదవ్, ఎంపీఓ లింగయ్య డాక్టర్ శ్యాంప్రసాద్, రాథోడ్ శీల్పా అధికారులు ప్రజాప్రతినిధులు వైద్య సిబ్బంది ఉన్నారు.

సీఎం సహాయక నిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-భీమారం

సీఎం సహాయక నిధి కోసం మండలానికి చెందిన తగురం కావ్య విజయకు మంజూరైన చెక్కును మండల బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. మంగళవారం బీఆర్ఎస్ మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబం సీఎం సహయనిధి నుంచి అర్థించగా అందుకు మంజూరైన చెక్కును అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్య రాజ్‌కుమార్ నాయక్, బీఆర్ఎస్వీ మండలం అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్, కొత్తపల్లి సర్పంచ్ గోదారి తిరుపతి, నాయకులు వడ్లకొండ కిష్టయ్య, జల్లంపల్లి తిరుపతి, రాజన్న, ధరవత్ శేఖర్, శంకర్, మనోహర్, మల్లేష్ విగ్నేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆస్తి కోసం హత్య.. ఆత్మహత్యగా చిత్రీకరణ

- వీడిన మహిళ హత్యకేసు మిస్టరీ
- తొమ్మిది మంది నిందితుల రిమాండ్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఆస్తిపై ఉన్న ఆశ కుటుంబ సభ్యులనే హత్యచేసే స్థితికి దిగజార్చింది. తనవారేనని నమ్ముకున్న వారిని కడతేర్చిన ఘటన పెంచికల్ పేట్ మండలం కమ్మర్‌గాంలో చోటు చేసుకుంది. ఆస్తి కోసం సొంత పెద్దనాన్న, ఆయన కుమారుడు కలిసి ఒక మహిళను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసు మిస్టరీని కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు చేధించారు. మంగళవారం రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు వివరాలను వెల్లడించారు. పెంచికల్ పేట్ మండలం కమ్మర్గాం గ్రామానికి చెందిన దుర్గం దస్రుబాయి (22) ఈ నెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని తల్లి శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెంచికల్ పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్య కాదని, హత్య అని విచారణలో తేలింది. కమ్మర్‌గాం గ్రామానికి చెందిన భూదయ్య, లింగయ్యలు అన్నదమ్ములుకాగా, లింగయ్యకు కుమారుడు తుకారాం, భూదయ్యకు ఒక కూతురు దస్రుబాయిలు ఉన్నారు. పాలిపంపాకాల్లో భూదయ్యకు ఐదు ఎకరాల పంట చేను రాగా, మగపిల్లలు ఎవరూ లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న భూదయ్య బాగోగులను చూస్తే తుకారాంకు సగం వాటా ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో భూదయ్య మరణించగా, అస్పత్రి ఖర్చుల కింద సుమారు రూ.3 లక్షలు ఖర్చయ్యాయి. అదే విధంగా భూదయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రైతు బీమా రూ.ఐదు లక్షలు తుకారాంకు ఇవ్వకపోగా, సగం వాటా కింద ఇస్తానన్న భూమి కూడా పట్టా చేయించకపోవడంతో ఎలాగానైనా దస్రుబాయిని హత్య చేసి ఆస్తి రాబట్టుకోవాలని తుకారాం, ఆయన తండ్రి లింగయ్యలు పతకం వేశారు. గత దసరా సమయంలో తుకారం తనకు తెలిసిన మర్తిడి గ్రామానికి చెందిన మానెపెల్లి మహేందర్‌ను సంప్రదించి దస్రుబాయిని హత్య చేయాలని చెప్పాడు. దీంతో మహేందర్ తనకు తెలిసిన గబ్బాయికి చెందిన విలాస్, ప్రశాంత్, డోంగ్రి వినోద్‌లను సంప్రదించి రూ.50 వేలకు తుకారాంతో హత్య ఒప్పందం చేసుకుని రూ.4,500 అడ్వాన్స్ తీసుకున్నారు. అయినప్పటికీ వీరు హత్యచేసేందుకు కాలం వెళ్లదీస్తుండడంతో తుకారాం తనకు తెలిసిన మొట్లగూడకు చెందిన వగాడె రమేష్, చౌదరి ప్రభాకర్‌లను సంప్రదించి హత్యకు ఒప్పందం చేసుకున్నాడు. వీరు ఒకమారు హత్యకు రెక్కీ నిర్వహించివెళ్లారు. వీళ్ళు సైతం కాలం వెళ్ళదీస్తుండడంతో తిరిగి మానెపెల్లి మహేందర్‌ను తుకారాం సంప్రదించగా మానెపెల్లి మహేందర్ తోపాటూ ఎల్లూరుకు చెందిన జనగామ మహేందర్ హత్యచేసేందుకు అంగీకరించారు. లింగయ్యతో కలిసి సాయంత్రం రెక్కీ నిర్వహించి హత్యచేయాలని ప్రయత్నించగా చుట్టుపక్కల రైతులు ఉండడంతో వెనుదిరిగారు. తిరిగి ఉదయం వెళ్ళి దస్రుబాయి గొంతు నొక్కి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా పురుగుల మందు తాగించి ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఈ మేరకు తొమ్మిది మంది నింధితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో పెంచికల్ పేట్ ఎస్సై విజయ్ పాల్గొన్నారు.

ఆదివాసుల హక్కుల సాధనకు పోరు



నవతెలంగాణ-జైనూర్

తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీ, గిరిజనుల సమస్యలు, హక్కుల సాధనకై పోరాడే సంఘం ఆదివాసీ గిరిజన సంఘమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కనక యాదవరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం-2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేల ఉందన్నారు. ఇప్పటికే అనేక కార్యక్రమాలు నిర్వహించి ఆదివాసులకు ఎంతో న్యాయం చేస్తున్నారని అభినందించారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లాలో పోడు భూముల సమస్యలపై పోరాటం చేయడంతోనే రాష్ట్ర ప్రభుత్వం సర్వేలు నిర్వహించిందని తెలిపారు. హక్కు పత్రాలు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. జిల్లాలోని గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు శాంతియుతంగా పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఆదివాసుల గిరిజన సమస్యలపై అండగా నిలవడానికి నిర్విరామంగా పోరాడడానికి ముందుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభుదయ, జైనూర్ గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, కుమ్రం కేశవరావు, మడావి భీంరావు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఈజీఎస్ టీఏ సలీం, ప్రజా ప్రతినిధులు, సహాయ కార్యదర్శి ఉట్ల రవి పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాస్

నవతెలంగాణ-హాజీపూర్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా రెండో ఏఎన్ఎంలతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుబ్బారాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం స్కీమ్‌లో పని చేసే డాక్టర్లను రెగ్యూలర్ చేసి రెండో ఏఎన్ఎంలను ఎందుకు రెగ్యూలర్ చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు మాత్రం వీరు కావాలని అన్నారు. వారికి మాత్రం రెగ్యూలర్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొనమని తెలుపుతున్నామని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవడానికి రెండో ఏఎన్ఎంలను ఒక బానిసల్లగా ఈ ప్రభుత్వాలు చూడటం బాధకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వరూపరాణి, అనసూయ, సుధ, మంజుల, పద్మ, గాయిత్రి, విజయ, సత్యవతి, ఖలిందర్ అలి ఖాన్, మిట్టపల్లి పోల్, దేవి పోచ్చన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని రాజన్నగూడ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని జెడ్పీచైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. మంగళవారం జెడ్పీచైర్మెన్ నివాసంలో రాజన్నగూడ గ్రామస్తులు చైర్మెన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యపై విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. గ్రామంలో ప్రదానంగా పోడు భూముల సమస్యలు ఉన్నాయని అన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురికి నీటి కాలువలు, గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. గ్రామానికి వెళ్లే దారిలో వాగు ఉందని, వర్షాకాలంలో వాగుపై లోలెవల్ వంతెన ఏర్పాటు చేయడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. వాగుపై పూర్తి స్థాయిలో వంతెనను మంజూరు చేయాలని గ్రామస్తులు చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సలీం, గ్రామస్తులు బక్కన్న, మైసన్న, భీమ్ రావ్, శ్రీనివాస్, ఎల్లన్న, నారాయణ ఉన్నారు.

నేడు జరిగే డిగ్రీ పరిక్ష వాయిదా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో రెగ్యూలర్ డిగ్రీ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే బుధవారం జరిగే డిగ్రీ పరీక్షను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు కేయూ పరీక్షల విభాగం అదనపు అధికారి డా.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 18వ తేదీన వాయిదా వేసిన పరీక్ష తిరిగి ఫిబ్రవరి 8వ తేదీన ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు గమనించాలని అధికారులు సూచించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
బుధవారం 18 జనవరి 2023

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కడెం ప్రభుత్వ ఆస్పత్రి హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ గోపాల్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం కడెం మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19 నుండి కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తమ కంటి పరీక్షలను ఉచితంగా చేసుకోవాలని అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు

నవతెలంగాణ- నిర్మల్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రూప్-2, 3, 4 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగుల కోసం మూడు నెలల ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వి. రాజేశ్వర్ గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఫిబ్రవరి 6 నుంచి మే 5 వరకు నిర్వహించే ఉచిత శిక్షణకు అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.. అభ్యర్థులు కనీసం ఏదైనా జనరల్, ప్రొఫెషనల్ కోర్సులో డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. కుటుంబ ఆదాయం రూ. 3 లక్షలకు మించకూడదని తెలిపారు. 15 జనవరి 2022 తర్వాత నుంచి తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు.

కంటివెలుగు శిబిరాల్లో అన్ని వసతులు కల్పించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాల్లో ప్రజలందరూ కంటి పరీక్షలు చేయించుకొనేలా అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశం మందిరంలో ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలతో కంటివెలుగు కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18న ఖమ్మం జిల్లాలో సీఎం కేసీఆర్ కంటివెలుగు శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. 19న జిల్లాలలో ఉదయం 9 గంటలకు కంటివెలుగు శిబిరాలు ప్రారంభమవుతున్నందున 18న సంబంధిత అధికారులకు కేటాయించిన గ్రామాల్లో ఉదయం 8.00 గంటలకల్లా చేరుకోవాలన్నారు. గ్రామాల్లో టామ్‌టామ్ చేయించాలని, ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. షెడ్యూల్ ప్రకారం ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. మండల స్థాయి కంటివెలుగు టీమ్‌లో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఆప్టోమెట్రిస్ట్, ఒక మెడికల్ సూపర్‌వైజర్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటరు, ఇద్దరు ఆశా సిబ్బంది, ఇద్దరు ఏఎన్ఎంలు ఉంటారని పేర్కొన్నారు. మండల హెడ్ క్వార్టర్స్‌లోనే టీమ్ మెంబర్స్ రాత్రి బస చేస్తారని అన్నారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. టీం సభ్యులు ఉదయం ఒక గంట ముందుగానే కేంద్రానికి చేరుకుంటారని తెలిపారు. కంటి వెలుగు పరీక్షల సమాచారం ప్రజలకు తెలియచేసేందుకు, పూర్తి షెడ్యూల్డు వివరాలతో గ్రామాలలో ఇంటింటికి కంటి వెలుగు ఆహ్వాన పత్రికలు అందజేయాలని అన్నారు. పరీక్షా కేంద్రంలో ఐదు టేబుల్స్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తారని మొదటి టేబుల్ ద్వారా రిజిస్ట్రేషన్, రెండవ టేబుల్ కంటి పరీక్ష, మూడవ టేబుల్‌లో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం సిబ్బంది బీపీ, ఇతర మెడికల్ హిస్టరీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. నాలుగో టేబుల్ ద్వారా ఆటో రిఫాక్టర్ మెషిన్ ద్వారా ఆప్టోమెట్రిస్ట్ కండ్ల పరీక్ష నిర్వహిస్తారని, ఐదో టేబుల్ వద్ద అవసరమైతే రీడింగ్ గ్లాసెస్ ఇస్తారని అన్నారు. వెంటనే యాప్‌లో డేటా అప్డేట్ చేస్తారని వివరించారు. ప్రిస్కిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారికి పదిహేను రోజుల్లో ఆశా సిబ్బంది ద్వారా ఇంటికే పంపించడం జరుగుతుందన్నారు. ఇప్పటికి 30 వేల రీడింగ్ గ్లాసెస్ జిల్లాకు చేరుకున్నాయని అన్నారు. వీటిలో 75 శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపడం జరిగిందన్నారు. అలాగే కంటివెలుగు మెటీరియల్ పీహెచ్‌సీలకు పంపడం జరిగిందని తెలిపారు. కేంద్రాలలో వచ్చిన వారికి కుర్చీలు, తాగునీరు, టాయిలేట్స్ వసతులలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని అన్నారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని అన్నారు. పరీక్షా కేంద్రాలలో రద్దీ లేకుండా బందోబస్తు



చర్యలు తీసుకుంటూ ఉదయం కొంత మంది, సాయంత్రం కొంత మంది ఏర్పాటుతో రోజూ దాదాపు 300 నుండి 400 మందికి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాస్థాయి అధికారులందరినీ కంటివెలుగులో భాగస్వామ్యం చేయడం జరిగిందని, ప్రోగ్రాం ఆఫీసర్స్ ప్రతి రోజూ 5 నుండి 6 శిబిరాలను తనిఖీ చేస్తారని అన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్స్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి వెలుగు కేంద్రాలు సోమవారం నుండి శుక్రవారం వరకు ఐదు రోజులు పనిచేస్తాయని, శనివారం, ప్రభుత్వ సెలవులలో పనిచేయవని తెలిపారు. కంటి వెలుగు పరీక్షకు వచ్చే ప్రజలు తమ వెంట ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని అన్నారు. కంటివెలుగు కార్యక్రమం సాఫీగా జరిగేందుకు కలెక్టరేట్ కార్యాలయంలో 18004255566 నెంబర్ ద్వారా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయ సహకారంతో జిల్లాలో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలందరూ కూడా కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకొని తమ కంటి జబ్బులను దూరం చేసుకోవాలని కోరారు. ఎవరైనా అనారోగ్యబారిన పడిన వారికొరకు అత్యవసర పరిస్థితికై అంబులెన్సు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 9, 11 గంటలకు, మధ్యాహ్నం 1, 3 గంటలకు రెండు గంటలకొకసారి రిపోర్ట్ సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఏ చిన్న పొరపాటు జరగకుండా అప్రమత్తంగా ఉంటూ క్యాంపులను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, రెవిన్యూ అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్ ఒకరికి తీవ్రగాయాలు



నవతెలంగాణ-సారంగాపూర్

ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీ కొట్టిన ఘటన మంగళవారం మండలంలోని నిర్మల్, స్వర్ణ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ప్రక్కన నిర్మల్, స్వర్ణ రహదారిపై మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహారాష్ట్ర కిన్వట్ తాలూకా, నాయక్ తండాకు చెందిన అశ్విన్(41) ఎంహెచ్26 బిఎల్ 5481 ద్విచవాహనంపై నిర్మల్ వైపు వెలుతున్న వాహనదారుడిని, నిర్మల్ వైపు నుండి ఏపీ 30 వీ 9935గల టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. కాగా అపస్మారకస్థితిలో కొట్టుమిట్టాడుతున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, 108 వాహనానికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పంపిణీ లేక అవస్థలు

నవతెలంగాణ-పెంబి

మండలంలోని పసుపుల కొలాంగూడ గ్రామ గిరిజనులు రేషన్ బియ్యం పంపిణీ చేయకపోవడంతో సంక్రాంతి పండగకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పసుపుల డీలర్ సస్పెండ్ కావడంతో మరో డీలర్‌ను నియమించకపోవడం..ప్రత్యామ్నాయంగా ఇక్కడ రేషన్ బియ్యం పంపిణీ చేయించకపోవడంతో గ్రామస్థులు పండగకు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు తెలియజేసినా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఇక్కడ పర్మినెంట్‌గా రేషన్ డీలర్‌ను నియమించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొమ్మెన సురేష్, డా.తిరుపతి, గ్రామ కమిటీ కార్యదర్శి కొమురం శ్రీనివాస్, కొమరం భీంరావ్, ఆత్రం శేషురావు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని అన్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది అందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. నేరేడుగొండ కేజీబీవీలో తొలగించిన నాన్ టీచింగ్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కేజీబీవీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్ని కేజీబీవీల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కేజీబీవీలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు వారానికి మూడు రోజుల్లో ఉన్న నైట్ డ్యూటీలు రద్దుచేసి బోధన సిబ్బందితో సమానంగా నైట్ డ్యూటీలు వేయాలని డిమాండ్ చేశారు.అనంతరం డీఈఓ ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సుల్తానా, అసోసియేషన్ జిల్లా నాయకులు ప్రేమల, లక్ష్మి, రుతిక, వేదవతి, యశోద, కవిత, పుష్ప, జమున పాల్గొన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈ నెల 21 నుంచి 28 వరకు వరకు నిర్వహించే కెస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లను భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కేస్లాపూర్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.నాగోబా జాతర చరిత్రను మెస్రం వంశీయులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం దర్బార్ హాలులో ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఈఓ రాజమౌళి ని మందిరానికి విద్యుద్దీకరణ, ఫ్లెక్సీలు తదితర వాటిని ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ జాతరకు రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్‌లు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా నార్నూర్,గాదిగూడ,మహారాష్ట్ర. జీవితి, కిన్వట్ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడుపాలన్నారు. ఈ సంవత్సరం సుమారు 5లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు,మరుగు దొడ్ల వద్ద నీటిని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.అవసరమైతే 10 అదనపు నీటి ట్యాంకర్ల ఏర్పాట్లు చేయాలని డీఈ శ్రీనివాస్‌కు సూచించారు. పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా ఉండాలని



సంబంధిత అధికారులకు చెప్పారు. కెస్లాపూర్ జాతర పరిసర ప్రాంతంలో గౌరాపూర్, ముత్నూర్, ఇంకర్ గూడ ,మెండాపల్లి తదితర ప్రాంతాల్లో ఎలాంటి బెల్టు షాపులు లేకుండా చూడాలన్నారు. జాతరకు వచ్చే భక్తులు మాస్కులు ధరించేలా అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌డీఓ కదం సురేష్, ఏఎస్పీ హర్షవర్ధన్ శ్రీ వాస్తవ, ఈఈ భీంరావు, ఆలయ చైర్మెన్ మేస్రం తుకారాం, పటేల్ వెంకట్‌రావు, డీడీ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలో వంజరి సంఘం ఆద్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మంగళవారం సర్పంచ్ వీరేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కుల సంఘాలు ఐక్యమత్యంతో అభివృద్ధికి దోహదపడే విధంగా మెలగాలని, అందుకు ఎల్లవేళలా మా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వంజరి సంఘం జిల్లా నాయకులు సోమేశ్వర్, వేణు, శివలింగం, నగేష్, నరేష్, విజయ్, బుచ్చయ్య, సిద్దు, శేఖర్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సమావేశంలో రవీందర్ పాల్గొని మాట్లాడారు. నేడు సమాజంలో అనేక అశాస్త్రీయ ఆలోచనలతో మూఢనమ్మకాలతో ప్రజలు నష్టపోతున్నారని అలాంటి సమాజాన్ని రక్షించడానికి మూఢనమ్మక నిరోధక చట్టం తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టం కోసం ఎదురు చూడకుండా ప్రజలను చైతన్యం చేసి శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత జన విజ్ఞాన వేదికపై ఉందని అన్నారు.ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లాలో చేస్తున్న కృషిని అభినందిస్తూ మరిన్ని కార్యక్రమాలు చేసి సమాజాన్ని చైతన్యం చేసి ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను కార్యకర్తలందరూ గుర్తెరిగి ముందుకు వెళ్లాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బెదోడ్కర్ సంతోష్ కుమార్, కోశాధికారి కత్తి శ్రీధర్ బాబు, జిల్లా నాయకులు ఎల్లుర్తి శ్రీనివాస్, బుక గంగయ్య, డి.ఉమాకాంత్, సుకుమార్ పాల్గొన్నారు.

జరుగుతున్న అభివృద్ధి ఎంపీకి కనిపించడం లేదా..!



నవతెలంగాణ-తాంసి

తెలంగాణలోని మారుమూల గిరిజన గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి ఎంపీ సోయం బాపురావుకు కనిపించడం లేదా అని తాంసి మండల బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తారుడు అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజల ఓట్లతో గెలిచిన నాలుగు సంవత్సరాల్లో కేవలం రెండు సార్లు మాత్రమే మండలంలో అడుగుపెట్టిన నాయకులు మీరేనని పేర్కొన్నారు. గిరిజన ప్రజలను తప్పుదోవ పట్టించడానికే రాష్ట్ర ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రం తెలంగాణకు నిధులు ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే అనేక అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. ఎంపీ కేంద్రం నిధులు తీసుకొచ్చేందుకు కృషిచేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మెన్ ధనుంజయ్, వైస్ ఎంపీపీ రేఖ రఘు, సర్పంచ్ యశ్వంత్, గజానన్, నాయకులు రమణ, గంగారాం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల జంగం సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా ఓం శివమహేశ్వర మాల జంగం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కుల సంఘాల వారికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సంఘానికి అన్నివిధాలా సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ఓం శివమహేశ్వర మాల జంగం సంఘ భవనం ఏర్పాటుకై స్థలాన్ని కేటాయించాలని సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాజరి వినోద్‌కుమార్, దేవళ్ల శంకరయ్య, గౌరవ అధ్యక్షుడు రాజమల్లు, కోశాధికారి గాజరి సంతోష్, సంయుక్త కార్యదర్శి మాదం మల్లయ్య, కార్యవర్గ సభ్యులు గాజరి చంద్రశేఖర్, గాజరి శ్రీకాంత్, మాటూరి లాస్మయ్య, అల్లురి జ్ఞానేశ్వర్, మాదం రామయ్య, కోదాడి రాజేశ్వర్, గణపురం రవి, తాండ్ర వెంకటేష్ ఉన్నారు.

గ్రూప్స్ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు విడుదల చేస్తోందని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ సూచించారు. ఈ సందర్భంలో మంగళవారం పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు గ్రూప్స్‌కు సంబంధించిన పోటీ పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేలాదిగా ఉద్యోగాల నోటిఫికేషన్‌లను విడుదల చేస్తోందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేకంగా వార్డు అధికారుల నియామకం సైతం జరుగుతోందని వివరించారు. బీసీ స్టడీ సర్కిల్ లో ఇటివల శిక్షణ పొందిన అనేక మంది అభ్యర్థులు తమ లక్ష్య సాధనలో విజయాలు సాధించారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖాధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్



ప్రవీణ్ కుమార్, శ్రీవాణి, అనూష, నరేష్, సాయి, రవి పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన సాయిబాబా వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

సాయిబాబా వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు అంకం రాజేందర్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గజారోహణ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే సాయి సత్ చరిత్ర పఠనం (సాయి పారాయణం) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈనెల 24న జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అప్పటి వరకు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలను వివరించారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని సాయి కృపకు పాత్రులు కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు సాయి భక్తులు పాల్గొన్నారు.



కంటి వెలుగును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ఈ నెల 19 నుంచి ప్రారంభిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం మేజర్ ఇంద్రవెల్లిని సందర్శించి కంటి వెలుగుపై ఆరా తీశారు. కంటి సమస్యతో బాధ పడుతున్నావారి వివరాలను సేకరించాలన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డా.శ్రీకాంత్, సర్పంచ్ కొరెంగ గాంధారి తదితరులున్నారు.



ప్రతి పల్లెలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలి

- డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి పల్లెలో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడేలా కార్యకర్తలు కార్యాచరణతో ముందుకు సాగాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న హత్‌సే హత్ జోడో పాదయాత్రపై మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి సీఆర్ఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి నాయకులు హాజరై వారి సలహాలు, సూచనలు అందించారు. ఈ పాదయాత్రలో చేపట్టాల్సిన అంశాలను సీనియర్ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రకు సంఘీభావంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో హత్ సే హత్ జోడో పాదయాత్ర చేపట్టాలని అధిష్టానం ఆదేశించిందన్నారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలను తెలియజేయాలని పిలుపు నిచ్చారు. రెండు నెలల పాటు ప్రజలతో మమేకమవుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నాయకులు సంజీవ్ రెడ్డి, ఆనంద్‌రావ్, భూపెల్లి శ్రీధర్, కొండ గంగాధర్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

28న సైన్స్ సెమినార్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 28న "దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం" అనే అంశంపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యావేత్తలు, ఇతర క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఒక రోజు సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు జిల్లా సైన్సు అధికారి కటుకం మధూకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు తమ పాఠశాలల సైన్స్ టీచర్లను ఫిబ్రవరి 2 లోగా నిర్ణీత ఫార్మాట్‌లో ఇమెయిల్ పంపాలని సూచించారు. రైట్-అప్ స్క్రీనింగ్ తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులు మాత్రమే సెమినార్‌లో పాల్గొనడానికి అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్సు అధికారి కటుకం మధూకర్ 9441140434 నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నిరుద్యోగ గిరిజన యువతకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు గ్రూప్-4, హాస్టల్ వెల్ఫేర్, ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షల కొరకు గిరిజన యువతకు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ కె.వరుణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతి యువకులు ఫిజికల్ ఫిటినెస్ (పార్ట్-2) ఉత్తరులైన గిరిజన అభ్యర్థులు తమ యొక్క ఫిజికల్ టెస్ట్, అడ్మిట్ కార్డుతో పాటు, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటోతో ఉట్నూరు కేబీ కాంప్లెక్స్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7893616392, 9493535052, 9666748105 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మహాసభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కౌటాల

కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఈ నెల 20న నిర్వహించే మన్నెవార్ల సేవా సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభకు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు బుర్స పోచయ్య, గౌరవధ్యక్షుడు సుంకె కిష్టయ్య హాజరవుతారన్నారు. సమావేశంలో గిరిజనేతర గ్రామాలను గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దడానికి 1/70 చట్టం పూర్తిస్థాయిలో గిరిజనులకు చెందేలా చర్చించడం జరుగుతుందన్నారు. కాగజ్‌నగర్‌లో అదనపు ఐటీడీఏను ఏర్పాటుచేయాలన్నారు. సంఘం బలోపేతానికి చర్చించడం జరుగుతుందని, అర్హులైన గిరిజనులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు మంజూరుచేయాలన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారుపెల్లి పోశం, మండలాధ్యక్షుడు ఎడ్ల భీమయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి మెర్పెల్లి సదాశివ్ ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-హాజీపూర్



నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపద్యాయుడిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని ప్రజాసంఘాలు నిరసన తెలిపాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం కార్మిక, ప్రజా, రైతు, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు, ఉపాధ్యాయ, ప్రజా, సామజిక సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు దళితులపైన కులం, మతం, ప్రాంతం, ఆహార అలవాట్లు అంటూ అన్నిటిపై దాడులు పెరిగిపోయాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ప్రభుత్వ పాఠశాలలో శాస్త్రీయతను బోధించే మల్లికార్జున్ టీచర్‌పై మతోన్మాద గుండాలు మతం పేరుతో దాడి చేసి పాఠశాల నుండి తీసుకెళ్లి దారుణంగా అవమాణించారన్నారు. మన దేశంలో మనకున్న రాజ్యాంగ హక్కులను కాలరాస్తు, ఇలాంటి దాడులకు పాల్పడుతున్న వారిని ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేయక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే దాడి చేసిన వారిని శిక్షించాలనీ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, రైతు సంఘం అధ్యక్షులు సంకె రవి, దూర్కే మోహన్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు, మోతె జయకృష్ణ, ఆశంపల్లి రమేష్, ఆగచారి, చంద్రమౌళి, దుర్గయ్య దిలీప్, కుమార్, శ్రీనివాసరావు, కిరణ్, రమేష్, గోమాస ప్రకాష్, దాసరి రాజేశ్వరి, దూలం శ్రీనివాస్, మహేందర్, కుమారస్వామి, దాగం శ్రీకాంత్, అభినవ్, రాకేష్ రిషి, అరవింద్, పలిగిరి కనకరాజు, రంగు రాజేశం, బమోతె రామదాసు, నేరెళ్ల వెంకటేష్‌లు పాల్గొన్నారు.

సమిష్టిగా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-జన్నారం

సర్పంచులు, కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు సమన్వయంతో పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని మంచిర్యాల డీఎల్‌పీఓ ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సర్పంచ్ అలుగునూరి సులోచన రవి, కార్యదర్శి పీ. వెంకట్‌లు గొడవ పడగా, విషయం తెలుసుకున్న ఎంపీడీఓ అరుణరాణి వచ్చి వారిని సముదాయించారు. ఈ విషయం మంచిర్యాల డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావుకు తెలపడంతో హుటాహుటిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని మల్టీపర్పస్ వర్కర్లు గత మూడు రోజులుగా పనిచేయకుండా ఉండడంతో, వారిని హెచ్చరించారు. పనిచేయడం ఇష్టం లేకపోతే పని మానేయండి వేరే వారిని పెట్టుకుంటాం కానీ ఇలా అనవసరంగా పనులను మానివేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ కార్యదర్శులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామ అభివృద్ధి సాధ్యమన్నారు. మరోసారి గ్రామం నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పురంశెట్టి రవి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ కమిటీల జాబితా పరిశీలన

నవతెలంగాణ-బెజ్జూర్

బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు జాడి దిగంబర్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆయా బూత్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం మండలంలోని గ్రామాల పోలింగ్ బూత్ కమిటీ జాబితాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శులు గురునాథం మురళీధర్‌గౌడ్, ఉమ్మెర బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ బీక్షపతి, దళిత మోర్చా మండలాధ్యక్షుడు లింగాల శంకరయ్య, ఉప సర్పంచ్ కోర్తె తిరుపతి, మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ తాళ్ల రామయ్య, కుకుడ మాజీ సర్పంచ్ పసిఉల్లాఖాన్, బెనికి శ్యాంసుందర్, బషీర్, కుబిడె సత్తయ్య, రౌతు బాలయ్య పాల్గొన్నారు.

షాట్‌సర్క్యూట్‌తో నిల్వ చేసిన పత్తి దగ్ధం

- రూ. 5 లక్షల ఆస్థి నష్టం

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన రైతు జలంపల్లి రామయ్య రేటు పెరుగుతుందని ఆశించి పత్తిని ఇంటిలో నిల్వచేసిన పట్టి షాట్‌సర్క్యూట్‌తో దగ్ధమైది. మంగళవారం మధ్యాహ్నం రామయ్య ఇంటిలో చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో 50 క్వింటాళ్ల పత్తితో పాటు గృహోపకరణాలు, కట్టుబట్టలు కాలిపోయినట్లు అధికారులు గుర్తించారు. విద్యుత్ మీటర్‌లో షాట్‌సర్క్యూట్ ఏర్పడి చెలరేగిన మంటలతో పత్తి నిల్వ చేసిన షెడ్ కాలిపోగా సోఫా సెట్, ఇంటి తలుపులు, కర్రతో తయారు చేయించిన బల్ల, ఆహార ధాన్యం మంటల్లో కాలిపోయినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ సంఘటనతో సుమారు రూ.5లక్షల ఆస్థి నష్టం జరిగిందని ప్రాథమికంగా జరిపిన విచారణలో తేలినట్లు స్థానిక తహసీల్దార్ మోహన్ రెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో రామయ్య కుటుంబ సభ్యులు కూలీ పనికి పోగా ఇద్దరు చిన్నారులు ఆరుబయట ఆడుకుంటుండగా అకస్మాత్తుగా ఇంటి నుండి వచ్చిన మంటలు గుర్తించి మంటలను చల్లార్చడం జరిగిందని తెలిపారు. కాలిపోగా మిగిలిన పత్తిని అమ్ముకోవడానికి వీలులేకుండా పోయిందని, రామయ్య కుటుంబం కట్టుబట్టలతో మిగిలిందని స్థానిక సర్పంచ్ లింగారెడ్డి తెలిపారు. విషయం తెల్సుకున్న తహసీల్దార్ మోహన్ రెడ్డి, వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ సంఘటనా స్థలాన్ని సంధర్శించి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తామని వారు పేర్కొన్నారు.

సింగరేణి ఉద్యోగులు భద్రత, బాధ్యత కలిగి ఉండాలి



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి ఉద్యోగులు పని స్థలాల్లో వ్యక్తి గత భద్రత, బాధ్యత కలిగి ఉండాలని సింగరేణి సేఫ్టీ అధికారులు సింగరేణి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై జనవరి 16 నుంచి 31వ తేది వరకు నిర్వహిస్తున్న పని స్థలాల్లో ఉద్యోగుల వ్యక్తి గత భద్రత, భాధ్యతలపై అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఎస్పీఎం ఎస్ఎంటీసీ విజయ్ కుమార్, మేనేజర్ మాటూరి రవీందర్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ కారుకూరి రాంచందర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతు వ్యక్తి మృతి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం మల్లయ్య(56) సోమవారం మందపల్లి ప్రధాన రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద రోడ్డు ప్రమాదం జరగగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్సై తానాజీ నాయక్ తెలిపారు.

ప్రజా సంఘాలను బలోపేతం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

నవతెలంగాణ-తాండూర్



నియోజకవర్గంలోని మండలాల్లో ప్రజా సంఘాలను బలోపేతం చేస్తూ పార్టీ పటిష్టతకు తోడ్పడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఐబిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10, 11వ తేదీల్లో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం మగ్దూం భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయడానికి ఈ నెల 22వ తేదీన జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జిల్లా సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో పార్టీ ప్రజా సంఘాలను బలోపేతం అయ్యే విధంగా గ్రామ గ్రామాన పార్టీ విస్తరణ జరగాలని ఆయన అన్నారు అందుకు మండల స్థాయి నాయకులు పటిష్టంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందే అంతవరకు ప్రజా ఉద్యమాలు చేయాలని కోరారు. మంచిర్యాల జిల్లాలో ఉన్నటువంటి పోడు భూముల సమస్యలను నేషనల్ హైవే 363 రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించి నష్టపరిహారం చెల్లించాలని రోడ్లు పూర్తిస్థాయిలో అయిపోయిన తర్వాతనే మందమారి కేకే ఓసి వద్ద ఏర్పాటుచేసిన టోల్ ప్లాజా వద్ద వసూలు నిలిపివేయాలని ఆయన కోరారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి పార్టీ శ్రేణులు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా ఉద్యమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, నియోజకవర్గ సహయ కార్యదర్శి మామిడాల రాజేశం, సీపీఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, జిల్లా సమితి సభ్యులు గుండా చంద్రమాణిక్యం, ప్రజా సంఘాల నాయకులు పట్టి శంకర్, ప్రహ్లాద్, ముత్యం శంకర్, గొల్ల భీమయ్య జిదుల రాము పాల్గొన్నారు.

మనఊరు మనబడి పనుల పరిశీలన



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి గ్రామ పంచాయితీలోని కల్మల్ పేట పాఠశాలలో జరుగుతున్న మనఊరు మనబడి పనులను మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, నాయబ్ తహసీల్దార్ సంతోష్‌కుమార్, సర్పంచ్ గాలి మదు, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలకు మంచిర్యాల జిల్లాలోని అర్హులైన ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దళిత అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23లో గ్రూప్ 2, 3, 4 పోటీ పరీక్షలకు 3 నెలల ఫౌండేషన్ కోర్సులో ఉచిత కోచింగ్ కోసం క్వాలిఫైయింగ్ ఎక్సమ్‌లో భాగంగా డిగ్రీలో మెరిట్ ఆధారంగా నాన్ రెసిడెన్సియల్ విధానంలో ఎంపిక ఉంటుందన్నారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్‌లలో ఉచిత కోచింగ్ పొందిన అభ్యర్థులు అనర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని దళిత అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రెండో ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను జీఓ 16లో చేర్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేసి వైద్యాధికారి ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత 15 సంవత్సరాల నుంచి రెండో ఏఎన్ఎంలు చాలిచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల ప్రాణాలను కాపాడటంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేశారని గుర్తు చేశారు. వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించి, బేసిక్-పే అమలు చేయాలని అన్నారు. పని భారం తగ్గించాలని కోరారు. రొటీన్ ఇమ్యునైజేషన్‌కు సంబంధించిన అలవెన్సులు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెండో ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, రెండో ఏఎన్ఎంలు పుణ్యబాయి, భాగ్యలక్ష్మి, సునీత, ప్రమీల, వసంత, రజిని, సత్యమ్మ, శైలజ, పుష్ప, రాధ, భారతి పాల్గొన్నారు.

జాతర పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలోని కుర్రేఘూడ్ గ్రామంలో ఈ నెల 21 నుంచి 23వ తేది వరకు శ్రీశ్రీశ్రీ పాహుండి కుపర్ లింగు స్వామి జాతర నిర్వహించనున్నట్లు జాతర నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పాహుండి కుపర్ లింగు స్వామి జాతరకు సంబంధించిన పోస్టర్లను మంచిర్యాలలో డీటీడీఓ నీలిమా చేతుల మీదుగా విడుదల చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో మొదటి రోజు 21న ఉదయం నవగ్రహాల ప్రతిష్టాపన, సాయంత్రం నుంచి రాత్రి వరకు భజన, 22న అగ్రి గుండం, మాల విరమణ, దర్బార్, పెద్దపూజ, 29న ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జాతర నిర్వాహన కమిటీ సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులు ఆత్రం జంగు, మడావి వెంకటేశ్, పెంద్రం ప్రభాకర్, సిడం గణపతి, పెంద్రం శంకర్, మడావి గంగారాం, కనక రాజు, ఆడె జంగు, ఎడ్మ కిషన్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బెజ్జూర్

కంటి వెలుగును విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సురేష్‌బాబు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుండి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని, కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, హెచ్‌వి రేణుక పాల్గొన్నారు.

వాంకిడి : సవాతి గ్రామ పంచాయతీలో నిర్వహించే రెండో విడత కంటి వెలుగును గ్రామ పరిధిలో గల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సవాతి సర్పంచ్ దేవ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి కళ్లద్దాలతో పాటు కంటి పరీక్షలు కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

18 ఏండ్లు పైబడిన వారందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం

కాసిపేట : మండల కేంద్రంలోని ధర్మారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని చైర్మన్ నీలా రాంచందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘంలో రైతులకు అందిస్తున్న సేవలు, చేయాల్సిన విధి విధానాలపై చర్చించారు. గతంలో సహకార సంఘంలో పని చేసిన సీఈఓ వద్ద ఉన్న ట్రాక్టర్ విషయమై సహకార సంఘానికి ట్రాక్టర్ అప్పగించలేదని, దీనిపై స్పష్టత ఇవ్వడం లేదని, దీనిపై చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ నీలా రాంచందర్, డైరెక్టర్లు కాసు సురేందర్, సోగాల సాగర్, జంజరాల విష్ణుమూర్తి, చెల్ల మల్లేశ్, దుర్గం లక్ష్మి, చుక్క రామస్వామి, మంచు మల్లేశ్, కొప్పు శంకరయ్య పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

పెంచికల్‌పేట్ : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మండలంలోని చెడ్వాయి గ్రామంలో కోనేరు యువసేనా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంటులో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. కబడ్డీ టోర్నమెంటులో విజేతగా అందవెల్లి జట్టు, రన్నరప్‌గా చెడ్వాయి జట్టు నిలవగా వారికి షీల్డుతో పాటు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ సిద్ధికి, సర్పంచ్‌లు సంజీవ్, దేవాజీ, బీఆర్ఎస్ నాయకుడు చౌదరి శ్రీనివాస్, బాబు, చౌదరి బండన్న, శశికుమార్, వెంకటేశ్, లక్ష్మణ్, రామన్న పాల్గొన్నారు.

రాధాకృష్ణ ఆలయానికి రూ. 50లక్షలు మంజూరు

నవతెలంగాణ- నిర్మల్

పట్టణంలోని వార్డు నెం. 33 భాగ్యనగర్ రాధాకృష్ణ ఆలయ ప్రాంతంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహాయ సహకరాలతో ఆలయ పునఃనిర్మాణానికి రూ. 50 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కాలనీలో అభివృద్ధి పనుల గురించి కాలనీ వాసులతో చర్చించటం జరిగిందన్నారు. పట్టణ నియోజకవర్గంలో దాదాపు 600 పైగా నూతన ఆలయాలు నిర్మాణం చేసుకోవటం జరిగిందన్నారు. రాధాకృష్ణ ఆలయాన్ని అత్యంత అద్భుతంగా, సుందరంగా నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శ్రీనివాస్, నరహరి, రాందేవ్, దామోదర్, బాబు, తిరుపతి, శ్రీహరి, సత్యనారాయణ, నర్సింహులు, ఆలయ అభివృద్ధి కమిటీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆకాశ్ నుసన్మానించిన నాయకులు

నవతెలంగాణ-తాండూర్

శ్రీలంకలో జరిగిన అండర్ 17 పదహారవ ఆసియా కప్ చదరంగం పోటీల్లో రజత పథకం సాధించిన తాండూరు మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన సమ్మయ్య లక్ష్మీ దంపతుల కుమారుడు ఆకాష్‌ను బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. తమిళనాడులో జరగబోయే జాతీయ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆకాష్ పాల్గొనబోతున్న సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు రామగౌని మహీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి రూ.5వేల నగదు అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, మండల ప్రధాన కార్యదర్శి విష్ణు కళ్యాణ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి విగ్నేష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని మర్కాగూడ గ్రామంలో రాజ్‌గోండు యువజన సంఘం అధ్వర్యంలో మడవి రాజు స్మారకంగా గత వారం రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు మంగళవారం నాడు ముగిశాయి. కబడ్డీ పోటీలకు దాదాపు యాభై జట్లు వివిధ గ్రామాలతో పాటు మహారాష్ట్ర నుంచి జట్టులు పాల్గొన్నాయి. తుది పోటీలు నిర్వహించడంతో మహారాష్ట్ర తలాయిగూడ జట్టు మొదటి విజేతగా నిలిచింది. మొదటి బహుమతిగా రూ.21వేలు సాకటి దశరథ్ అందజేశారు. రెండో బహుమతి మహారాష్ట్ర జావర్ల జట్టు రూ.15వేలు త్రియంబక్ అందజేశారు. మూడో బహుమతి చింతగూడ రూ.10వేలు, నాలుగో బహుమతి మర్కాగూడ రూ.7వేలు భీంపూర్ సర్పంచ్ ఉపసర్పంచ్ అందజేశారు. అటలో మంచి నైపుణ్యాన్ని కనబర్చిన వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా పలువురిని గ్రామ యువజన సంఘం సభ్యులు సర్పంచ్‌లను ప్రజాప్రతినిధులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మడవి సునీత, మడవి లింబాజీ, ఉపసర్పంచ్ జాదవ్ రవీందర్, నాయకులు పాండ్ రంగ్, పురుషోత్తం, యువజన సంఘం సభ్యులు ఉన్నారు.

సైన్స్ ఫెయిర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 28న ఉపాధ్యాయులకు సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు దీనికోసం ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం అనే అంశంపైన రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యావేత్తలు, ఇతర క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఒక రోజు సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు, రైట్-అప్ స్క్రీనింగ్ తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులు మాత్రమే సెమినార్‌లో పాల్గొనడానికి ఆహ్వానించబడతారని పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాలు సైన్స్ ఉపాధ్యాయులు ఫిబ్రవరి 2 లేదా ఆలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ మొబైల్ నెంబర్ 9441140434ను సంప్రదించాలని పేర్కొన్నారు. టి-శాట్ నెట్‌వర్క్ ద్వారా 19.న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర క్షేత్రస్థాయి కార్యకర్తలతో సెమినార్ పేపర్‌ను ఎలా సిద్ధం చేయాలి సమర్పించాలి అనే అంశంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైల్వే పనుల ఆలస్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైల్వే పనులు జాప్యమవుతున్నాయని కేంద్రం ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయడం లేదని ఎంపీ సోయం బాపురావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేయనున్న పిట్‌లైన్ పనులను మంగళవారం పరిశీలించారు. అంతకు ముందుకు రైల్వే స్టేషన్ సమీప కాలనీ అయిన తాటిగూడ వాసులతో వారి సమస్యలను తెలుసుకున్నారు. పిట్ లైన్ ఏర్పాటు అయితే రోడ్డు సౌకర్యం ఉండదని, ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎంపీకి కాలనీ వాసులు విన్నవించారు. రైల్వే అధికారులు వీటిపై ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని ఎంపీ సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆదిలాబాద్ ప్రజలకు రోడ్డుతో పాటు రైలు రవాణ సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిట్‌ను మంజూరు చేశారని తెలిపారు. ఆదిలాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ టూ అర్మూర్ రైల్వే పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 40 శాతం ఇవ్వడానికి ముందుకు రావడం లేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో వంద శాతం నిధులు కేంద్రం కేటాయించి పనులను ప్రారంభిస్తుందని స్పష్టం చేశారు. ఆర్మూర్ రైల్వే పనులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మాట్లాడితే మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాతున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీ వెంట రైల్వే బోర్డు సభ్యులు జీవీ రమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహసినిరెడ్డి, రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఎంపీపీ భర్తకు పలువురి పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్

దాడికి గురైన ముప్కాల్ ఎంపీపీ భర్త సామ వెంకట్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధుడిపై ఇలా దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. పరామర్శించిన వారిలో తహశీల్దార్ విక్రమ్, ఎంపీడీవో దామోదర్, ఎంపీవో భరత్ చంద్ర, వ్యవసాయాధికారి రాజ్ కుమార్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కో అప్షన్ సభ్యులు మునిరొద్దీన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాగంపేట్ ముత్తెన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ, మండల అధికారులు ఉన్నారు.

వేముల రోహిత్‌కు నివాళులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వేముల రోహిత్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన రోహిత్ వేముల ఏడవ వర్ధంతి సందర్భంగాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ ఉపాధ్యక్షులు నరసయ్య ఆధ్వర్యంలో రోహిత్ వేముల చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ క్యాంపస్‌లో మతోన్మాద శక్తులు వేముల రోహిత్‌ను వెంబడించి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమయ్యారని అన్నారు. మతోన్మాదులవల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై పోరాటాలు సాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, కృష్ణ, సాయిలు, రాజు, గోవర్ధన్, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రాదేవికి పూజలు.. కేస్లాపూర్‌కు పయనం





నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈ నెల 21న నాగోబా పూజకు ఉపయోగించే పవిత్ర గంగాజలం కోసం పయనమైన మెస్రం వంశీయులు ఖటోడ (పూజారి) కోసు, దర్ము, హన్మంతు, ప్రధాన్‌లు దాదే రావ్, మెస్రం తిరుపతి, గణపతిలు మంగళవారం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకున్నారు. గోదావరి నుంచి సేకరించిన పవిత్ర గంగా జలం ఝారి (కలశం)ను ఆలయ ప్రాంగణములో ఓ చెట్టు మీద భద్ర పరిచారు. వివిధ గ్రామాల నుంచి మెస్రం వంశీయులు ఏడ్ల బండ్ల ద్వారా ఇంద్రాదేవి ఆలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఇంద్రాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం వేళ కెస్లాపూర్ వైపు పయన మయ్యారు.ఇక్కడ వారి కుటుంబాలతో మర్రిచెట్టు సన్నిధిలో బస చేస్తారు. ఈ నెల 21 వరకు పూజ ప్రారంభం అయ్యేవరకు బసచేయడం ఆనవాయితీగా వస్తోంది.





అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి

- మార్చి 1, 2, 3తేదీల్లో సమ్మె
- అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-హాజీపూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మార్చి నెల 1, 2, 3 తేదీల్లో సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ తెలిపారు. తెలంగాణ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం డీడబ్ల్యూఓ కార్యాలయంలో జిల్లా నోడల్ అధికారి హేమసత్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని అన్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. గత 40 సంవత్సరాలుగా పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దీనివల్ల అంగన్‌వాడిలు చాలా నష్టపోతున్నారని అన్నారు. మన పక్కన ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని అన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ తదితర రాష్ట్రాలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండుగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. మన రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు అంగన్‌వాడీ ఉద్యోగులకు కల్పించడం లేదన్నారు. అంగన్‌వాడి వర్కర్ పేరు టీచర్స్‌గా మార్చారు కానీ టీచర్‌గా సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు మాత్రం ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో శంకరమ్మ, రాధాబాయి, అనురాధ, రాజేశ్వరి, మహేశ్వరీ, విరోనిక, పుష్పలత పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు నెట్వర్క్‌ను అందేల కృషి

- బీఎస్ఎన్ఎల్ సేవలపై ఎంపీ సోయం సమీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి మారుమూల గిరిజన గ్రామానికి నెట్వర్క్‌ను అందించేల బీఎస్ఎన్ఎల్ అధికారులు కృషి చేయాలని టెలికాం అడ్వైజరీ కమిటీ చైర్మెన్, ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టీఏసీ సభ్యుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీ సోయం బాపురావు పాల్గొని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ సేవలపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం టవర్ల ఏర్పాటుకు అనుమతించిందని, అటవీ ప్రాంతాల్లో స్థల సేకరణ విషయంలో ఇబ్బందులు వస్తున్నాయని జీఎం కేవీఎస్‌రావు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర మంత్రుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానన్నారు. తొలి సమావేశానికి హాజరైన ఎంపీని పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కరోనా సమయంలో మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నెట్వర్క్ లేని కారణంగా అనేక మంది విద్యకు దూరమయ్యారని అన్నారు. ఆ పరిస్థితి ఇక ముందు రావద్దనే ఉద్దేశ్యంలో ప్రతి గిరి పల్లెలో టవర్లను ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 160 గ్రామాల్లో టవర్ల ఏర్పాటుకు అనుమతులు వచ్చిన కొన్ని ఇబ్బందులు కారణంగా పనులు ముందుకు సాగడంలేదని తెలిసిందన్నారు. ఈనెల 31 నుంచి పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయం ప్రస్తవించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అటవీ అనుమతులను తొందరగా ఇచ్చేల కృషి చేస్తానన్నారు. నెట్వర్క్ లేని ఏ ఒక్క గ్రామం కూడా లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, బీఎస్ఎన్ఎల్ ఏజీఎం దేవిదాస్, డీజీఎం జగ్గరాం, ఐఎఫ్ఎ విజయ్ కుమార్, జేటీఓ రవీందర్, శ్రీధర్, సీతారాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాకే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

నవతెలంగాణ-ఉట్నూర్



తెలంగాణ ప్రభుత్వం 317 జీఓ ఆధారంగా బదిలీ అయిన ఉపాధ్యాయల సమస్యలు పరిష్కరించాకే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెడ్మ శ్యాంరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి కానుక అంటూ బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నట్లు ప్రకటించినందున 317 జీఓతో చాల మంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. భార్యభర్తలు సైతం స్థానికత ఆధారంగా దూరం దూరంగా బదిలీలు అయ్యారని అన్నారు. ఇతర జిల్లాలకు బదిలీలు అయిన టీచర్లకు సీనియార్టీల జాబితాలో అన్యాయం జరుగుతుందన్నారు. బదిలీ అయిన టీచర్ల సర్వీసును పరిగణలోకి తీసుకొని బదిలీలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉన్న ఐదవ షెడ్యూల్లో రాజ్యాంగానికి విరుద్ధంగా గిరిజనుల బదిలీలను చేశారని అన్నారు. రద్దు చేసిన జీఓ 3ను తిరిగి అమలు చేయాలన్నారు. ఎమ్మెల్సీలు, గిరిజన ప్రాంత ఉపాధ్యాయుల సమస్యలపై గొంతు విప్పాలని, పాత పద్ధతుల్లోనే బదిలీలు చేయనట్లయితే అడ్డుకుంటామని త్వరలోనే చలో హైదరాబాద్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ముందస్తు మార్గదర్శకాలు ప్రకటించి 317 జీఓతో బదిలీ అయిన వారికి న్యాయం చేయాలని, సీఆర్టీల వేతనాలను వెంటనే చెల్లించాలని, 13 జిల్లాల్లో బదిలీ అయిన భార్యభర్తల టీచర్ల సమస్యలు పరిష్కరించి గ్రేడ్ -2 హెచ్‌ఎంలకు అప్‌గ్రెడేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్, ప్రధాన కార్యదర్శి జాదవ్ సురేష్, నాయకులు సదానంద్, ఇందల్ సింగ్, విఠల్, కైలాస్‌లు ఉన్నారు.

మాయమాటలతో కాలం గడుపుతున్న కేసీఆర్



నవతెలంగాణ-భైంసా

మాయమాటలతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతున్నారని బీజేపీ నియోజకవర్గ నాయకులు మోహన్‌రావు పటేల్ అన్నారు. మంగళవారం భైంసాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలంటూ ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు ఇప్పటివరకు నాలుగు మండలాల్లో ధర్నా చేయడం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రెండు లక్షల 40 వేల ఇండ్లు మంజూరు చేస్తే ముధోల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఏ ఒక్కరికి ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ఆయన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి సవాల్ విసిరారు. రైతాంగానికి రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో టిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు అంతకు ముందు ఆయా గ్రామాల ప్రజలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు రాస్తారోకో చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాలి రవి, డి. శ్రీనివాస్, సుభాష్ పటేల్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

28న ఆదిలాబాద్‌కు అమిత్‌షా రాక

- కోర్ కమిటీ సమావేశంలో ఎంపీ సోయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్ సభ ప్రవాస ప్రచారంలో భాగంగా జనవరి 28 నుంచి తెలంగాణలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటించనున్నారని ఎంపీ సోయం బాపురావు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆయన మాట్లాడుతూ తొలుత పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజవర్గాలకు రానున్నారని తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈనెల 28న అమిత్‌షా జిల్లాకు రానున్నారని, సభను ఆదిలాబాద్‌లో నిర్వహించేల ప్రణాళికలపై కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఆదిలాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటున్నారని అన్నారు. అయితే సభ ఎక్కడ నిర్వహించలో స్థలం నిర్ణయించాల్సి ఉందన్నారు. త్వరలో సభ వివరాలను వెల్లడిస్తామని, సభ ఎక్కడ ఉన్న విజయవంతం చేసేల ప్రతి నాయకుడు కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయిన తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేల 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తారని, తొలుత ఉమ్మడి ఆదిలాబాద్ నుంచే ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, ఉమ్మడి జిల్లా పార్లమెంట్ అల్జాపూర్ శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, రాథోడ్ రమేష్, చిట్యాల సుహాసిని రెడ్డి, శ్రీనివాస్, అమర్నాథ్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అసమర్ధత వలననే రైతులకు గోస



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా పంటలకు సాగు నీరందక రైతులు గోస పడటానికి ఎమ్మెల్యే దివాకర్ రావు అసమర్ధతనే కారణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేరబెల్లి రఘునాథ్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఉత్కూర్ చౌరస్తా వద్ద చేపట్టిన బీజేపీ రైతు గోస దీక్షలో పాల్గొని ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యంగా మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు చేతగాని తనం వలననే గూడెం లిఫ్ట్ పనులు ప్రతి ఏటా రిపేర్లు అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021లో మంత్రి హరీష్ రావు స్వయంగా అసెంబ్లీలో గూడెం లిఫ్ట్ పైపులు మార్చుతామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఎందుకు నాణ్యమైన పైపులు వేయలేదని ప్రశ్నించారు. మేఘ ఇంజనీరింగ్ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టకపోవడానికి అధికార పార్టీ నాయకుల అవినీతి కారణమని ఆరోపించారు. అనంతరం ఉత్కూర్ చౌరస్తా నుంచి ఇరిగేషన్ కార్యాలయం వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాదయాత్ర చేశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు సాగు నీరందించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరి గోపాల్, నాయకులు ప్రభాకర్, బొప్పు సతీష్, కిషన్, దండేపల్లి, లక్షెట్టిపేట్ మండలాల రైతులు పాల్గొన్నారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల ఆయా కాలనీల్లో పర్యటించిన సమయంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను మంగళవారం నిర్వహించిన పుర ప్రజావాణిలో కమిషనర్ శైలజకు విన్నవించారు. మిషన్ భగీరథ, సాల్టర్ హౌస్, రోడ్డు తదితర సమస్యలు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నేటిసభనుండి హామీల అమలను ప్రారంభించాలి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి సీపీఐ బహిరంగ లేఖ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ రాశారు. దీన్ని మంగళవారం పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ రైతాంగానికి ఒక లక్ష రూపాయలు ఒకేసారి రుణమాఫీ చేస్తామని, కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కేసీఆర్ హామీనిచ్చారన్నారు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని అన్నారని తెలిపారు. దళితులకు మూడు ఎకరాల భూమి పేదలకు భూ పంపిణీ చేస్తామని, ఇండ్లు లేనివారికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తామని, అందరికీ తెల్ల రేషన్ కార్డు ఇస్తామని, 57 సంవత్సరాలు దాటిన వారికి, వృద్ధులకు పెన్షన్ ఇస్తామని ఇలా ఎన్నో ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజలకు హామీలను ఇచ్చారన్నారు. వీటిని ఈనెల18న ఖమ్మంలో జరిగే చారిత్రాత్మక సభ నుండి ప్రారంభించి అమలు పరచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎండి.రఫిక్ ఖాన్, రఘురాం, అంజలి, నాయకులు అమర్, గంగాసాగర్ పాల్గొన్నారు.